క్లుప్తంగా

ఎంపీపీ స్కూల్ పరిశీలన



మండవల్లి: మండవల్లి ప్రాథమిక పాఠశాల-1ను సర్పంచ్ మెండా ఝాన్సీ శుక్రవారం పరిశీలించారు. నూతనంగా వచ్చిన టీచర్‌ను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు చిరుప్రాయంలో ఉన్నత ప్రమాణాలతో అభ్యసించే విద్య భవిష్యత్‌కు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదానం



గుడివాడ టౌన్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) గుడివాడ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. గుడివాడ పరిసర ప్రాంత ప్రజల అవసరాల కోసం రక్తనిల్వలు సేకరిస్తున్నామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ డి. సూరజ్, డాక్టర్ యు.సురేష్‌బాబు, డాక్టర్ పి. వంశీకృష్ణ, డాక్టర్ పి. రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ సోమూరి రాజా, డాక్టర్ ఎం. అజయ్‌రాజ్‌తో పాటు ఏఎన్నార్ కళాశాల, జ్యోతి పాలిటెక్నిక్, వీకేఆర్, వీఎస్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు మొత్తం 65 మంది రక్తదానం చేశారని పేర్కొన్నారు.

నాలుగు డీఏ బకాయిలు వెంటనే చెల్లించండి



పామర్రు(తోట్లవల్లూరు): ఉపాధ్యాయులకు నాలుగు డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు డిమాండ్ చేశారు. తోట్లవల్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కాంపెయిన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, తోట్లవల్లూరు మండల అధ్యక్షుడు ఐ.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ సర్వీసులకు రూ.6.40 లక్షల అపరాధ రుసుం



పామర్రు: మండలంలో అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 276 సర్వీసులను గుర్తించి, వాటికి సంబంధించి రూ.6,40,550 అపరాధ రుసుం విధించామని మచిలీపట్నం విజిలెన్సు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వాసు తెలిపారు. మండలంలో విద్యుత్ అక్రమ సర్వీసులపై శుక్రవారం తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలలో మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోవిందరావు, పామర్రు ఏడీఈ సుందరరావు, డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



గుడివాడ టౌన్ : రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జీవీ పూర్ణచంద్రరావు కల్యాణ మండపంలో ఇంజినీరింగ్ చదువుచున్న పేద విద్యార్థినికి రూ. 60 వేలు విలువగల ల్యాప్‌టాప్ అందజేశారు. స్థానిక దనియాల పేటలోని ప్రణవాశ్రమ గోశాలలో క్లబ్ సభ్యుడు ఏవీఎస్ మారుతీ కుమార్ ఆధ్వర్యంలో ఎనిమిది బస్తాల గో దాణా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వై. నాగేశ్వరరావు, జి. కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షులు టీఎస్ రాజశేఖర్, వై. రెడ్డయ్య చౌదరి, ఎం.రమణమూర్తి, సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో అమరావతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కాలేజీ వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు సూరపనేని సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా అంతర్గత రహదారులు

- వాహనచోదకుల ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పామర్రు చిన్న పాల కేంద్రం వద్ద అధ్వానంగా మారిన రహదారి



పామర్రు శివాలయం ఎదురు బజారు రోడ్డుపై ఏర్పడిన గుంతలు

పామర్రు: పామర్రులో అంతర్గత రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే రహదారులు బురదమయంగా మారుతున్నాయి. ఏవార్డులో చూసినా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారి గుంతలతో నిండి పోయి ఉండటంతో వాహనచోదకులు, ప్రజలు రాక పోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక శివాలయం బజారులో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి వాటిలో వర్షం నీరు నిల్వ చేరుతోంది.

వర్షం నీరు నిల్వ

కొద్ది పాటి వర్షానికే వర్షం నీరు రహదారులపై ఉన్న గుంతల్లో చేరి వారాల తరబడి నిల్వ ఉంటోంది. ఆ నీరు దోమలకు నిలయంగా మారుతోంది. దీంతో ప్రజలు వ్యాధులబారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారులపై ఉన్న గుంతలను పూడ్చించాలని కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



పామర్రులో అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రాక పోకలకు అవస్థలు పడుతున్నాం. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– కూసం పెదవెంకటరెడ్డి, పామర్రు

దోమలతో ఇబ్బందులు



పామర్రులో ఇళ్ల మధ్యలోని రహదారులు గుంతలమయంగా మారాయి. ఆ గుంతల్లో వర్షం నీరు నిల్వ చేరుతోంది. దీంతో దోమలు ఉధృతి బాగా పెరిగింది. అధికారులు స్పందించి రహదారుల పై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చించాలి.

– ఒడుగు గంగాధర ప్రసాద్, సీఐటీయూ నాయకుడు

ఇంజినీరింగ్ కళాశాల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్ : స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. చెన్నైకు చెందిన డెల్ఫీ-టీవీఎస్ కంపెనీ, బెంగళూరుకు చెందిన టాప్ అకాడమీ ఈ క్యాంపస్ ఎంపికలు నిర్వహించారన్నారు. చెన్నైకు చెందిన కంపెనీలో 29 మందికి, బెంగళూరుకు చెందిన కంపెనీలో 14 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని పేర్కొన్నారు. మొత్తం 260 మంది ఈ ఎంపికకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



వాలీబాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

గుడివాడ టౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక శుక్రవారం జరిగిందని ఆ ఫెడరేషన్ గుడివాడ డివిజన్ ఇన్‌చార్జ్ వై. కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ ఎంపిక జరిగిందని పేర్కొన్నారు. గుడివాడ డివిజన్ పరిధిలోని 12 మండలాలకు చెందిన 682 మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొన్నారన్నారు. అండర్-14, అండర్-17 కేటగిరిల్లో వాలీబాల్, చెస్, యోగాలో టీమ్‌ల ఎంపిక జరిగిందన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ కె. రవికుమార్, ఎంఈఓలు బాలాజీ, సురేష్, గోపాల్ నాయక్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఆటపాక సంపద కేంద్రం వద్ద డ్రెయిన్‌లో పేరుకు పోయిన గుర్రపుడెక్కపై ప్రశ్నిస్తున్న జెడ్పీ సీఈఓ

కైకలూరు: పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపై పంచాయతీ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎం.శ్రీహరి పేర్కొన్నారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్)లో కైకలూరు మండలం ఆటపాక మేజర్ పంచాయతీలో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోయిన అంశంపై ఫిర్యాదు అందింది. దీంతో సీఈఓ ఆటపాక గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. రోడ్డు పక్కనే చెత్తను, డ్రెయిన్ల వ్యవస్థను పరిశీలించి తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగించకపోవడంపై ప్రశ్నించారు. గ్రామాన్ని పారిశుద్ధ్య నిర్వహణలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. పంచాయతీ సిబ్బంది జేసీబీలతో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రాజాబాబు, డెప్యూటీ ఎంపీడీఓ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ పాల్గొన్నారు.

రాడార్ కీలకమైన ఆయుధం



సైంటిస్ట్ శేషగిరి దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ రవీంద్రబాబు తదితరులు

గుడ్లవల్లేరు: సమకాలీన యుద్ధాలలో, రక్షణ రంగంలో రాడార్ ఒక కీలకమైన ఆయుధమని నేవల్ ఫిజికల్ అండ్ ఓషనోగ్రఫీ లేబరేటరీ, కొచ్చి డి.ఆర్.డి.ఓ. సంస్థ ఉన్నత స్థాయి శాస్త్రవేత్త (సైంటిస్ట్-హెచ్) దువ్వూరి శేషగిరి అన్నారు. స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీని ఆయన శుక్రవారం సందర్శించారు. గగన లక్ష్యాలను గుర్తించే రాడార్-భారత దృక్కోణంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్షణ రంగంలో ఇంజినీర్ల పాత్ర కీలకమైందన్నారు. తదనుగుణంగా విద్యార్థులు పరిశోధన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని సూచించారు. భారతదేశ పరిశోధన అభివృద్ధి ద్వారా రాడార్ సాంకేతికతలో ఆత్మ నిర్భరత సాధించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఎయిర్ ఇంటర్సెప్ట్ రాడార్ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు దాని అభివృద్ధి, భారత వాయుసేనలో దాని ప్రాధాన్యతను విశదీకరించారు. అనంతరం ఆయన్ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, పి.సిద్దయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోదండరామారావు దుశ్శాలువ, జ్ఞాపికతో గౌరవసత్కారం చేశారు. డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, పి.జి.సి.ఆర్.డి. డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్.ఎస్.ఆర్.వి.ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ ఎం.కామరాజు, కన్వీనర్ డాక్టర్ వై.రామకృష్ణ పాల్గొన్నారు.

సమయపాలనతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న సౌమ్యలక్ష్మీ ప్రియాంక

మొవ్వ: విద్యార్థులు సమయపాలనతో ఒత్తిడికి దూరంగా ఉండవచ్చని మార్పు ట్రస్ట్ (విజయవాడ) ప్రాజెక్ట్ మేనేజర్ కె.సౌమ్యలక్ష్మీ ప్రియాంక పేర్కొన్నారు. కేంద్ర పథకం పీఎం ఉషా లింగ సమ్మిళితం, సమానత్వం అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక వేమూరి సుందరరామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో పీఎం-ఉషా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడి దీర్ఘకాలం పాటు కొనసాగితే అది శారీరక, మానసిక, ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలను చూపుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ మంజుల, శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నిమ్మగడ్డ ఉమాశ్రీ, అధ్యాపకులు డాక్టర్ టి శ్రీకాంత్, టీ కరుణశ్రీ, ఎస్ బి.రఫియా తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

మండవల్లి: మండవల్లిలోని కైకలూరు వీధిలో డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో రహదారిపైన నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశానానికి కూడా ఇదే రహదారి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీని అభివృద్ధి చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించండి



కలిదిండి(కైకలూరు): గ్రామాల్లో హానికర ప్లాస్టిక్ వినియోగంపై పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించి, ప్లాస్టిక్‌ను నిషేధించాలని కలిదిండి ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర సూచించారు. సానారుద్రవరంలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి తడి, పొడి చెత్త సేకరణపై పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

ట్రంప్ సుంకాల ప్రభావంపై చర్చా కార్యక్రమం

కలిదిండి(కైకలూరు): అమెరికాలో ట్రంప్ సుంకాల వలన భారతదేశంలో వాటి ప్రభావం అనే అంశంపై ఏపీ ఉపాధ్యాయ ఐక్య ఫెడరేషన్ (యూటీఎఫ్) సభ్యులు కలిదిండి యూపీ స్కూల్లో స్టడీ సర్కిల్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సుంకాలకు దారి తీసిన కారణాలపై చర్చించారు. ఎగుమతి, దిగుమతులపై ఎంత సబ్సిడీలు, సుంకాలు ఉండాలనే అంశాలపై ఐక్యరాజ్య సమితి గేట్ ఒప్పందం ద్వారా తెలియజేసిందని పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడటానికి ఇతర దేశాల నుంచి తయారై అమెరికా దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై విచ్చలవిడిగా సుంకాలను ట్రంప్ ప్రభుత్వం విధించిందని తెలిపారు. ఆ సంఘ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీవీ సాగర్‌బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రకటనలు చూసి మోసపోవద్దు

కైకలూరు: ఆన్‌లైన్‌లో ఆకర్షణీయ ప్రకటనలు చూసి ప్రజలు మోసపోవద్దని కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. కైకలూరు పట్టణ సీఐ ఏవీఎస్ రామకృష్ణ ఆదేశాలతో కైకలూరు కార్నర్ స్టోన్ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణ, ఆన్‌లైన్ మోసాలు, ఏటీఎం పిన్ నంబర్లతో నగదు చోరీ తదితర విషయాలపై శుక్రవారం అవగాహన కల్పించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్ : రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ సి. సూర్యచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గుండె, మెదడు, వెన్నెముఖ, ఊపిరితిత్తులు, కాలేయం తదితర ప్రధాన అవయవాలకు సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రామ్‌రాజ్ షోరూం ప్రారంభం



రామ్‌రాజ్ ఉత్పత్తులు అందజేస్తున్న డాక్టర్ మాగంటి శ్రీనివాస్

గుడివాడ టౌన్ : వస్త్ర ప్రపంచంలో తనదైన ముద్రవేసుకుని రామ్‌రాజ్ కాటన్ షోరూం గుడివాడలో ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందానికి, ప్రతిష్టకు, నమ్మకానికి రామ్‌రాజ్ ఉత్పత్తులు ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో గుడివాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు టీఎస్‌వీ సాంబశివరావు, రామ్‌రాజ్ కాటన్ ఫౌండర్, చైర్మన్ కేఆర్ నాగరాజన్, మొదటి కొనుగోలుదారు జీఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

మీడియేటర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు: ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కమిటీల్లో మీడియేటర్లుగా సీనియర్ న్యాయవాదులు, సోషల్ వర్కర్లు, న్యాయ నిపుణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. దరఖాస్తులు న్యాయ సేవాధికార సంస్థల వద్ద లభిస్తాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మచిలీపట్నం న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కార్యదర్శి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్లకు ఈ నెల 28వ తేదీ లోపు అందించాలని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి



గుడివాడలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

గుడివాడ టౌన్ : కూటమి ప్రభుత్వంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని.. దానిని కాపాడాలంటూ గుడివాడకు చెందిన పలువురు విలేకరులు, సాక్షి సానుభూతిపరులు కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యానికి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు తెలియజేస్తున్న సాక్షి దినపత్రిక యాజమాన్యం, పత్రికా అధికారులపై బెదిరింపులకు దిగడం, నోటీసులు జారీ చేసి దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదన్నారు. పోలీసులు తమ హద్దులు దాటి ప్రవర్తించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాక్షి సానుభూతిపరులు కె. ఆంజనేయప్రసాదు, తులిమిల్లి యెషయ్య, షేక్ సయ్యద్, సాయి, పాత్రికేయులు రాంబాబు, రాజ్‌కుమార్, చందు, మణికంఠ, రత్నరాజు, ఖాసీం, సుధాకర్, పండు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: ప్రజల పక్షాన వార్తా కథనాలను ప్రచురిస్తున్న 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టి, పత్రికా స్వేచ్ఛను హరించడం దారుణమని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డికి పోలీసులు నోటీసుల పేరుతో వేధింపులపై పామర్రు జర్నలిస్టుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు ప్రసాదు, శ్రావణ్, కృష్ణమూర్తి, శివకుమార్, సన్‌దీప్, విజయకుమార్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛను హరించే దుందుడుకు చర్యలను సమాజంలో ప్రతి ఒక్కరూ ఖండించాలని పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అన్నారు. నకిలీ మద్యంపై వార్తలు రాస్తున్న 'సాక్షి' పత్రిక ఎడిటర్, బ్యూరో ఇన్‌చార్జి, పలువురు జర్నలిస్టులకు పోలీసులు నోటీసులు అందించి, వేధించడాన్ని నిరసిస్తూ స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ ఎండీ ఇబ్రహీంకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ పత్రికా రంగంలో సమాచారం అందించే వారి (సోర్స్) పేర్లు వివరించమనడం ఎన్నడూ లేదన్నారు. ఇప్పటికైనా పాత్రికేయులను వేధించడం మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా సామ్నా ప్రధాన కార్యదర్శి కురేళ్ల కిషోర్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.శ్యామ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎండీ.ఇక్బాల్, వి.పాల్‌రాజ్, రమేష్, రాజేష్, పేర్రాజు, పాండు, వీరాంజనేయులు, అనిల్ పాల్గొన్నారు.

కూటమి విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాలు



సమావేశంలో మాట్లాడుతున్న దుక్కిపాటి శశిభూషణ్

గుడ్లవల్లేరు: కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యాచరణ చేసినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. మండలంలోని విన్నకోట గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, మాజీ మంత్రి కొడాలి నాని ఆదేశాలతో ఏదైతే కూటమి ప్రభుత్వం గవర్నమెంట్ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేయాలని చూస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేసినట్లు శశిభూషణ్ తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ నియోజకవర్గం పరిశీలకుడు సిలార్ దాదా, పార్టీ సీనియర్ నాయకుడు పాలేటి చంటి, జిల్లా యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు అద్దేపల్లి పురుషోత్తం, ఎంపీపీ కొడాలి సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు శాయన రవి గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, గుడ్లవల్లేరు మండలం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



డెప్యూటీ తహసీల్దార్ గోపాలరావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పామర్రు: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జువ్వనపూడి భాస్కరరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్షలు పడేలా దర్యాప్తు చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జీ బాబూరావు, పీ దినేష్ బాబు, ఎస్ జయరాజు, శీలం రాంబాబు, మునిపల్లి శ్రీనివాస్, భాను పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా మొవ్వలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ కే మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన రాకేష్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు శీలం రాంబాబు, జిల్లా అధ్యక్షులు సిద్దెల జయరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు మునిపల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పసుమర్తి దినేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కైకలూరు: స్థానిక వేలంపేట దుర్గాభవాని అమ్మవారి వార్షికోత్సవం ఇటీవల ఘనంగా నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. తాత్కాలిక సర్పంచ్ కేవీఎస్ఎం నాయుడు, తెంటు నాగేశ్వరావు, నాగేశ్వరమ్మ, వెంకటరమాదేవి, రామారావు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.